# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-10-2023** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు సాధించిన విజయం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు.**

2. **తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు క్వాష్ పిటిషన్ పై సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి.**

3. **ప్రకృతి వ్యవసాయంలో దేశానికే ఆంధ్రప్రదేశ్ దిక్సూచిగా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి తెలిపారు.**

4. **దేశవ్యాప్తంగా గత తొమ్మిదేళ్లలో పట్టణాభివృద్ధి పథకాలపై పెట్టుబడి మొత్తాలు గణనీయంగా పెరిగాయి.**

5. **ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి.**

==========================

చైనా వేదికగా జరిగిన ఆసియా క్రీడలలో భారతీయ క్రీడాకారుల బృందం అచంచలమైన సంకల్పం, స్ఫూర్తి ప్రదర్శించి దేశానికి 107 పతకాలు సాధించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఈ విజయం వెనుక వారి కృషి ఎంతో వుందని ట్విట్టర్ మాధ్యమంలో పేర్కొన్నారు. ఆసియా క్రీడల్లో భారతదేశం చారిత్రాత్మక విజయం సాధించిందని అభివర్ణించారు. భారతదేశ అథ్లెట్లు గత 60 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 107 పతకాలు సాధించడం పట్ల యావత్ దేశ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వారు సాధించిన ఈ ఘన విజయం మనందరికీ స్ఫూర్తిదాయకమని ప్రధాన మంత్రి ప్రశంసించారు. ఇలాఉండగా... ఆసియా క్రీడల్లో పాల్గొని దేశానికి తిరిగి వచ్చిన భారత క్రీడాకారులను ప్రధాన మంత్రి ఈ రోజు సాయంకాలం ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో కలుసుకోనున్నారు.

--------------------------

స్కిల్ డెవలప్మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఈ రోజు విచారణ జరుగుతోంది. చంద్రబాబు నాయుడు తరపున హరీష్ సాల్వే... సి.ఐ.డి. తరపున ముకుల్ రోహత్గి తమ తమ వాదనలు కొనసాగిస్తున్నారు. విచారణ విధానంపై ఇరుపక్షాల న్యాయవాదులు భిన్న వాదనలు వినిపించారు. వాదనలన్ని 17ఏ నిబంధనపైనే సాగుతున్నాయి. చంద్రబాబు నాయుడుకు 17ఏ వర్తిస్తుందని హరీష్ సాల్వే కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. అవినీతిని నిరోధించడం,

ప్రజా ప్రతినిధులపై ప్రతీకార చర్యలు వుండరాదన్నది 17ఏ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా గతంలో దాఖలైన కేసులపై వచ్చిన తీర్పులను కోర్టులో హరీష్ సాల్వే ఉదహరించారు. ప్రజా ప్రతినిధుల పాత్రపై విచారణ జరిపే ముందు గవర్నర్ అనుమతి కోరడం తప్పనిసరి అని కూడా సాల్వే వాదించారు.

ముకుల్ రోహత్గి వాదిస్తూ... 2018 పి.సి. చట్ట సవరణకు ముందే స్కిల్ డెవలప్మెంట్ కేసులో నేరం జరిగిందని తెలిపారు. 2021 సంవత్సరంలో ఎఫ్.ఐ.ఆర్. నమోదైందని... 2023 సంవత్సరంలో ఆధారాలు బయట పడడంతో చంద్రబాబు నాయుడును నిందితునిగా చేర్చారని... ఇందులో రాజకీయ కక్ష సాధింపు లేదని ముకుల్ రోహత్గి స్పష్టం చేశారు. భోజన విరామం అనంతరం తిరిగి 2 గంటలకు వాదనలు కొనసాగనున్నాయి.

-----------------------------

ప్రజల తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ జలాలు విడుదల చేశారని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకు ప్రకాశం, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలలోని తాగునీటి చెరువులను నింపేందుకు సాగర్ కుడి కాలువ ద్వారా ఈనెల 7వ తేదీ నుండి 5 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్టు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జలాలు ప్రకాశం జిల్లా సరిహద్దు పుల్లల చెరువు మండలం మానేపల్లి 85/3 మైలు రాయి వద్దకు ఈ నెల 12వ తేదీ నాటికి చేరతాయని ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు.

-----------------------------

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం గణనీయంగా ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి తెలిపారు. దక్షిణాఫ్రికా దేశాలకు చెందిన ప్రతినిధుల బృందం వెలగపూడి సచివాలయంలో తనను కలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ఉత్పత్తి ఖర్చులు తగ్గాయని... ప్రస్తుతం రాష్ట్రంలో కొంత మేర నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల ఆహార ఉ త్పత్తిపై ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృత స్థాయిలో చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే దిక్సూచి కానుందని ఆయన తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో సమగ్ర, సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని జవహర్ రెడ్డి పేర్కొన్నారు.

-----------------------------

దేశవ్యాప్తంగా గత తొమ్మిదేళ్లలో పట్టణాభివృద్ధి పథకాలపై పెట్టుబడి మొత్తాలు గణనీయంగా పెరిగాయని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. ప్రతి ఏడాది అక్టోబర్ నెల మొదటి సోమవారం నిర్వహించే ప్రపంచ ఆవాస దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... నగరాలు, పట్టణాల పరివర్తనాత్మక కృషిలో భాగంగా 2014 సంవత్సరం నుండి ఇప్పటివరకు 18 లక్షల కోట్ల రూపాయలకు పైగా మొత్తాన్ని పెట్టుబడిగా సమకూర్చడం జరిగిందని చెప్పారు. వ్యర్థ పదార్థాల నిర్వహణ 2014 సంవత్సరంలో 17 శాతం మేర వుండగా... ఇప్పుడు 76 శాతానికి పెరగడం విశేషమని హర్దీప్ సింగ్ పురి వివరించారు.

-----------------------------

మానసికంగా ఇబ్బందులకు గురౌతున్న వారిని ఆదరించి వారిని మనుషులుగా తీర్చిదిద్దాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బుల్లికృష్ణ చెప్పారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏలూరు తంగెళ్ళమూడిలోని మానసిక పునరావాస కేంద్రంలో ఉన్నవారి ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుల్లికృష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం అక్టోబరు 10న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగించేందుకు

దోహదం చేస్తుందని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మానసిక వికలాంగులకు అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందిస్తోందని చెప్పారు.

---------------------------

మనిషి శారీరకంగా ఎంత ఆరోగ్యంగా ఉన్నా... మానసికంగా ప్రశాంతత లేకపోతే జీవన గమనం లయ తప్పుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బెండి సాయిరాం అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ కళాశాల ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఈ రోజు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ... సరైన అవగాహనతోనే మానసిక సమస్యలను దూరం చేయవచ్చని అన్నారు. ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ మానసిక ఆరోగ్యం అనేది సార్వత్రిక హక్కు అనే నినాదం ఇచ్చిందని వివరించారు.

---------------------------

స్వచ్ఛభారత్‌లో తిరుపతిని మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత అన్నారు. తిరుపతిలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య అధికారులతో కమిషనర్ ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖాళీ స్థలాల్లో చెత్తను వేయడం, నిల్వ వుంచుకోవడం చేయరాదని... దీనివల్ల దోమలు పెరగడం, క్రిమికీటకాలకు నివాసాలుగా మారడం జరుగుతుందని అన్నారు. వెంటనే నగరంలోని ఖాళీ స్థల యజమానులు తమ స్థలాలను శుభ్రం చేయించుకోవాలని అన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అప్పగించాలని కమిషనర్ సూచించారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ నిరాశ్రయుల సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆవాసంలేని ప్రజల అవసరాలను తీర్చే అంశంపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి ఏటా అక్టోబర్ 10వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. భారతదేశంలో ఇళ్ళు లేనివారికి గృహ వసతి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది. ప్రధాన మంత్రి ఆవాస యోజన కార్యక్రమం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం లక్షలాది ఇళ్ల నిర్మాణం చేపడుతోంది.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి డి. శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

వాయిస్ – 40 సెకన్లు

---------------------------

ఆదిలాబాద్–తిరుపతి పట్టణాల మధ్య కాజీపేట మీదుగా నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలును ఈరోజు, రేపు రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే టికెట్లు తీసుకున్న వారికి నగదు తిరిగి చెల్లిస్తామని వారు పేర్కొన్నారు. గత రెండు వారాలలో కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేయడం ఇది రెండవ సారి.

---------------------------

ఆజాదీ కా అమృత్ మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న మేరా దేశ్ – మేరా మాటీ కార్యక్రమంలో భాగంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పంచాయతీలలో సేకరించిన మట్టిని ప్రత్యేక కలశాలలో పెట్టి ఆయా మండల పరిషత్ లేదా తహశిల్దార్ కార్యాలయాలకు చేర్చాలని అధికారులను జెడ్పీ సీఈవో చిరంజీవి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని... ప్రజలందరూ

భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయా పంచాయతీలలో దేశ స్వాతంత్రం కోసం పోరాడి అమరులైన వారి వివరాలను శిలాఫలకాలలో నమోదు చేస్తున్నామని ఆయన చెప్పారు.

---------------------------

నిరుపేదల భూములను ఆక్రమించుకోవాలని చూస్తే ఉపేక్షించేది లేదని ఎస్సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ హెచ్చరించారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో భూ సమస్యలపై బాధితుల నుంచి ఈరోజు వినతులు స్వీకరించారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ నిరుపేదల భూసమస్యలపై వినతులు స్వీకరిస్తున్నామని చెప్పారు. వాటిని స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని అన్నారు.

=======================